# కపీశ్వరుడు

చరిత్రాత్మకమైన పళ్ళదోపిడి ''జయప్రదం''గా ముగిసింది.మా అడవిలో ఇంత గొప్ప దోపిడి ఇంతగొప్పవిజయం యాభై అరవై యేళ్ళలోపున ఎప్పుడూ సంభవించలేదని ఎరిగిన పెద్దలు ఉద్ఘాటించారు. నిజానికి ఈ దోపిడి మేము ప్రారంభించింది కాదు.ఇంకో చెట్టుమీద జీవిస్తున్న మా శత్రువులే ముందుగా కయ్యానికి కాలుదువ్వారు. యుద్ధం ముగిసినసరికి వందలకొద్దీ శత్రు మర్కటాలు మొగవీ, ఆడవీ నేలకొరిగిపోయాయి. వాళ్ళ చెట్టుమీద పళ్ళన్నీ మేము దోచుకున్నాము. మాకు అఖండ విజయం చేకూరిందని ప్రకటించుకున్నాము.

మా కోతులం అనాగరిక జంతువులంకాము. సమరం ముగిసి మా చెట్టు మేము చేరుకొని మా గాయాలకి మేము వైద్యం చేసుకున్న తర్వాత విజయోత్సవాలు వైభవంగా జరిపించడానికీ, మా భగవంతుడికి మా కృతజ్ఞతాభివందనాలు సమర్పించడానికీ నిశ్చయించుకున్నాము. మరి మా దేవుడికి అభిషేకాలు చెయ్యకపోతే మరోసారి ఇటువంటి మంచి విజయం పంపించండని మాకు బాగా తెలుసును. అంచేత ఏంచేస్తే భగవంతుడు ప్రసన్నుడవుతాడా అని ఆలోచించాము. ఆయన జాగాలో మేముంటే మాకు ప్రీతికరమైన వేమిటని ఆలోచించాము. చిన్నలకీ, పెద్దలకీ మధ్య తీవ్రంగా చర్చలు జరిగాయి. మామూలు జీవితంలో మేము చేసే చప్పుడుకంటె మరి పదిరెట్లు బిగ్గరగా కీచులాడుకున్నాము. ఆఖరికి మా అందర్లోకీ ముసిల్దీ, అందరికన్నా తెలివైనదీ అయిన కోతి, ''నేనే దేవుణ్ణైతే. కొన్నివేల సంవత్సరాలుగా ఈ కొమ్మలమీద కిచకిచలాడే కోతుల్ని కనిపెట్టుతున్నట్లయితే మీరు నోరు మూసుకొని ఊరుకోవడమే నాకెంతో సంతోషదాయకమని నిస్సందేహంగా చెప్పగలను'' అంది. మా నోళ్ళు కట్టుపడ్డాయి. అప్పు డొకరిద్దరు లేచి ''అదీ అవశ్య కర్తవ్యం. విజయోత్సవాన్ని మనం అయిదు నిమిషాల నిశ్శబ్దంతో పాటిద్దాం'' అన్నారు.

అందుకు ఏర్పాటు జరిగింది. పళ్ళదోపిడి వార్షికోత్సవంరోజున కోతులన్నీ ఎక్కడి పనులు అక్కడ ఆపివేసి నిశ్శబ్దంగా ఉండాలని తీర్మానించుకున్నారు.

కాని అరణ్యజీవితం ఆదర్శప్రాయమైనదికాదు. అన్ని కోతులూ ఒక్కలాగే ఉండి, ఒక్క నాయకుణ్నే నమ్మి తమ జాతీయతనూ, ప్రాచీన సంప్రదాయాలనూ మన్నించగలిగిన వయితే మా చెట్టే ఒక భూలోక స్వర్గమనిపించుకొనేది. వ్యక్తిగత

TAMIL NADU
LIBRARY
MADRAS

సందేహాలను హతమార్చాలనీ, కోతిజాతి గొప్పతనం ఇప్పుడూ ఎప్పుడూ ఒక్కలాగే ఏ మార్పూ లేకుండా ఇలాగే చిరస్థాయిగా ఉంటుందనీ, అన్ని కోతులూ నమ్మవద్దూ? ఉహుఁ! మాలోనే కొన్ని కోతులు ఈ జాతీయభావాలకి విరుద్ధంగా ఆలోచిస్తున్నట్లు మాకు తెలిసింది.

ఈ సంగతి మాకు ముసలి గండభేరుండపక్షి చెప్పింది. ఈ అవ్వ మా పొరుగున ఒక కొండశిఖరంమీద జీవిస్తోంది. ఎప్పుడూ ఏవో పుకార్లు మోసుకురావడమే దీని పని. ఇహం, పరం అంటూ ఏవో వేదాంతాలు మాట్లాడుతుంది. జీవితాని కర్థమేమిటని అడుగుతుంది. భూలోకంలో తన జీవితం ముగిసిపోతున్నట్లు మాట్లాడుతుంది. కొంతకాలానికి భూమ్మీద గండభేరుండ పక్షులే ఉండకపోవచ్చు నంటుంది.

"కోతులుమాత్రం కలకాలం ఈ భూమిమీద ఉట్టికట్టుకొని ఊగుతా యను కున్నారా?" అని ఒకమారు గండభేరుండపక్షి మమ్మల్ని అడిగితే "నీ కెందుకీ సందేహం కలిగిం"దని దాన్ని నిలవేసి అడిగాం. అప్పుడు తెలిసింది మాలోనే కొందరు విప్లవకారులున్నారని.

యువకుల తరానికిచెందిన కోతుల్ని గండభేరుండపక్షి తీవ్రంగా విమర్శించ సాగింది. అవెక్కడా కిందామీదా ఉండకుండా పేట్రేగిపోతున్నాయంది. "అవి తమ తోకలగురించి తరుచు మాట్లాడుకుంటూ ఉంటా" యంది. "విషయం మంచిదే" అన్నాం మేము—"కోతిజాతికి తోక ప్రధానాలంకారం" అన్నాం.

"మీలో పడుచుకోతులు కొత్తఫేషన్ అవలంబించడం చూస్తున్నాను. వాటికి పొట్టి తోకలని ధరించడం నాజూకయినట్టు కనబడుతుంది. కొన్నాళ్ళకి తోకలని పూర్తిగానే విసర్జిస్తాయేమో" అని ముసలిపక్షి హేళనగా ఇకిలించింది.

మాకు చెడ్డ మండుకొచ్చింది. తోకతొక్కిన తాచుపాముల్లాగ లేచాం. "తోకలే లేకపోతే ఇక కోతు లెక్కడ? ఇటువంటి దుర్మార్గపు కూత లెందుకు కూస్తా"వని పక్షిని మందలించాం. మా తోకల్ని గురించి ఎవ్వరూ అవమానకరంగా మాట్లాడ డాన్ని మేము సహించం.

"ఈ దుర్మార్గపు కూత నాదికాదు. మీ కుర్రకోతులే ఈ ప్రచారం చేస్తున్నాయి. ఒకమారు ఇవి నన్ను పట్టుకొని దులిపి పారేశాయి. 'ఎగిరే సరీసృపం! ఇది ఎంతో కాలం మిగలదు. కొన్నాళ్ళకి ఈ జాతి అంతరిస్తుంది' అన్నా యవి. కోతులు ముమ్ముందు నాలుగుకాళ్ళమీద నడవడం మానేస్తాయనీ, తోకల్ని పూర్తిగా వదిలేస్తా యనీ అన్నాయి. 'అచిరకాలంలో మేము పరిణామం పొంది మానవులుగా మారిపోతున్నాం' అన్నాయి.

'అప్పుడు భూమిమీద గండభేరుండాలే కనబడవట' అంటూ ఆ ముసల్ది ఎగిరిపోయింది.

ముసలిదాని చాదస్తపు ధోరణికి మాలో మేము నవ్వుకున్నాం. "మానవుడట పరిణామమట!" ఎప్పుడూ వినలేదు ఈ మాటలు మేము. కాని తోక సంగతి మాత్రం మమ్మల్ని కలవరపరిచింది. తోకలు లేకపోవడమే! ఇంతకన్న విద్రోహం ఇంకోటి ఉండబోదు. తోక మా కోతిజాతికి పతాక! మా బతుక్కి పునాది! ఈ కుర్ర కోతులికి ఇవేం బుద్ధులో! అయినా పళ్ళదోపిడి తర్వాత పైకొస్తున్న కోతులు మర్యాదా, మప్పితం తప్పి మాట్లాడుతున్నాయి. కిందకొమ్మలలో ఇవి ఏదో తిరుగుబాటు లేవదీస్తున్నాయి. అందుచేత కొందరు గూఢచారులను పంపించాము, కొన్ని సోదాలు చేయించాము. గండభేరుండపక్షి చెప్పినదాంట్లో ఏమాత్రం నిజం వుందో కనిపెట్టడమే మా ఉద్దేశం.

తర్వాతకథ చెప్పడానికి ముందు చెట్టుమీద మా జీవితాన్ని కొంత వర్ణించాలి. మేం ఉంటున్నది అనేకానేక శాఖోపశాఖలతో అతి విస్తీర్ణమూ, అత్యున్నతమూ అయిన ఒక ఫలవృక్షం. మీది కొమ్మలలో గాలీ, వెలుగూ ధారాళంగా ప్రసరిస్తాయి. ఇక్కడ ఉన్నతకుటుంబాలకి చెందిన కోతులు జీవిస్తాయి. దిగువకొమ్మల్లోనూ, ఆ మాటకొస్తే నేలమీద బురదలోనూ వేలకొలది తక్కువజాతి కోతులు నీచంగా బతుకుతూ ఉంటాయి. కొన్ని మీదికి రావాలన్నా మిగిలినవి రానివ్వవు. అరుచుకుంటూ కరుచుకుంటూ ఇరవైనాలుగ్గంటలూ ఏవో కొట్లాటలలో కాలం గడుపుతూ ఉంటాయి. వాటిలో ఐకమత్యం అనేదే కనబడదు.

ఎగువకొమ్మల్లో జీవిస్తున్న మేము సుఖంగా కూర్చుని పళ్ళుతింటూ గింజలూ, తొక్కలూ కిందకి పారేస్తాం. వాటికోసం కిందకోతులు గిజగిజ తన్నుకు చస్తాయి. వాస్తవానికి మా పళ్ళన్నీ కిందకోతులే సంపాదించిపెడతాయి. ఆ సంగతి వాటికి తెలియదు. ఒక్కొక్కకోతి చాలా పళ్ళు సంపాదిస్తుంది కాని హాయిగా తినడానికి చోటుగాని తీరుబాటుగాని లేనందున వాటిపళ్ళన్నీ మాకే దక్కుతూ ఉంటాయి. వాటి పళ్ళని మేము చాలా తమాషాగా లాక్కుంటాము. మా ఉన్నతకుటుంబంలోఉన్న తెలివైన కోతుల్ని కిందకి పంపుతాము. ఇవి మరీ ఉన్నతంగా జీవించలేవులేండి. ఎంచేతనంటే వీటి మెదడుకున్నంత వాడి కోరలకిలేదు. ఇవి కిందకొమ్మలకి కొంచెందూరంలో తోకమీద వేలాడుతూ చమత్కారంగా ఊగి తక్కువజాతి కోతుల గుప్పెట్లలోంచి పళ్ళు తస్కరిస్తాయి! అప్పుడు చూడ ముచ్చటగా ఉంటుంది ఆ తక్కువ కోతుల ఆరాటం! ఇంతకు ముందుదాకా చేతిలో ఉన్న తిండి ఇట్టే తెలియకుండా

ఎగిరి పోతుంది. అంతటితో ఆ కోతుల ఆశ్చర్యం ఆగ్రహంగా మారి పోయి పొరుగుకోతుల పళ్ళమీద కవి బయల్దేరుతాయి. ఆ పొరుగుకోతులు మరి కొన్ని అడుగు కోతులమీదికి వెళ్ళుతూవుంటాయి. కొన్ని ఆహారాన్వేషణలో అట్టడుక్కి-పోతాయి. ఆహారంకోసం అట్టడుగున జరిగే సంగ్రామం అతిభయంకరం కాబట్టి ప్రతీ మర్కటం తనకాగతి పట్టకుండా ఎన్ని జాగ్రత్తలైనా పడుతుంది. ఆఖరికి తనప్రాణాని కైనా తెగిస్తుంది. ఈ విధంగా మేము ఎన్నోవేల సంవత్సరాలుగా జీవిస్తున్నాము. అప్పుడప్పుడు మా చెట్టుమీద సమృద్ధిగా పళ్ళు పండకపోయినా, ఇంకో చెట్టుమీద మాలాగే జీవిస్తున్న కోతులకి మరీ అపరిమితంగా పళ్ళుపండి మాకు కళ్ళు కుట్టినా మాలో మేము సాగించే వర్గ కలహాలని తాత్కాలికంగా కట్టిపెట్టి ఉన్నత కపిరాజుల ఉత్తరువుమీద దోపిడి దండయాత్రకి ఉపక్రమిస్తాం. ఇప్పుడు తెలిసిందా ఎందుకు మేము మా కపిత్వాన్ని ఆరాధిస్తామో? ఒకసారి కోతులు తమ కోతితనాన్ని పోగొట్టు కుంటే మా గొప్పతనమే దిగజారిపోయి అంతటా అరాజకత్వం అలముకుంటుంది. అనగా ఉన్నత కుటుంబపు కోతులకు సరిగా పళ్ళసరఫరా జరగదు. మా చెట్టు మాకు దక్కకపోవడమో, మాకన్నా బలవంతులయిన కోతులగుంపు మమ్మల్ని నాశనం చెయ్యడమో తటస్థిస్తుంది.

కాబట్టి మా గూఢచారులు విప్లవవాదుల నాయకుణ్ణి మా యెదుట హాజరుపెట్టి నప్పుడు మాకెంత ఒళ్ళుమండిందో ఎవరైనా సులభంగా ఊహించుకోగలరు. ఔరా, వీడి దారుణం! మాకు అత్యంత ప్రియమైన పతాకానికే వీడు ద్రోహం తలపెడు తున్నాడు. వీడూ, వీడి కోతిచేష్టలూను! తలఎత్తుకొని మా సమక్షంలో నిలబడ్డాడు. నిలుచున్నాడు. అదీ ఆశ్చర్యం! వెనక కాళ్ళమీద మా కోతులం ఎంతోసేపు నిలబడలేం. వీడు నిటారుగా నిలబడ్డాడు. ముందుకాళ్ళతో ఆసరా కూడా తీసుకోలేదు. అదీకాక వీడి ఒంటిమీద రోమాలు తక్కువ. ఒంటి రంగు కూడా మామూలు కోతుల రంగుకాదు. నిర్భయంగా నిలుచున్నాడండీ మా ముందు! తన ముందుకాళ్ళని ఎంతో తీరుబాటుగా వెనక్కి జారవిడిచాడు. వాటివేళ్ళు ఎందుకో తహతహలాడుతున్నాయి. వీణ్ణి చూస్తున్న కొద్దీ వున్నపాటున చీల్చి చెండాడా లన్నంత కోపం మా కందరికీ వచ్చింది. కొన్ని కోతులు పటపట పళ్ళుకొరుకుతూ గాండ్రించాయి. నాయకుడు మా కళ్ళలోకి తీక్ష్ణంగా చూస్తున్నాడు. ఇదో విరుద్ధ లక్షణం- ఎన్నో యుద్ధాలలో ఆరితేరిన మేము ఇతరుల కళ్ళలోకి తిన్నగాచూడం. భయంవల్లా, అనుమానంవల్లా మా కళ్ళలో కాపట్యమూ, బతుకులో అశాంతీ బలపడ్డాయి. వ్యూహాలు పన్నడం, రహస్యంగా ఆలోచించడం, అవసరాన్నిబట్టి వెనుకంజ వెయ్యడం, అనుకోకుండా మీదపడడం మా యోధులకి ప్రధాన లక్షణాలు. తిన్నగా అమాయకంగా ఎదిరి కళ్ళలోకి చూసేకోతి ఎప్పుడో ఓడి

పోయిందన్నమాట. కాని ఈ నాయకుడికి కోతితనమేలేదు. సమర వీరుల లక్షణాలేవీ వీడికి లేవు. యుద్ధ తంత్రజ్ఞు లవలంబించే మాయోపాయాలేవీ వీడికి తెలియవు. అంతే కాక వీడు ఇంకోవిధంగా మా సంప్రదాయాలకి విభిన్నంగా ప్రవర్తిస్తున్నాడు. ఏమంటే వీడు తన మనస్సులో ఏమి అనుకుంటున్నాడో అదే బైటికి కక్కేస్తున్నాడు. రహస్యాన్ని దాచడం వీడికి తెలియనే తెలియదు. శత్రువుకి మన ప్లాను తెలియనివ్వక పోవడమే అసలైన మిలిటరీ జాతివాడి లక్షణమని వేరే చెప్పాలా? ఈ అన్ని కారణాలవల్లా వీడి చేతకానితనం స్పష్టమయిపోయింది. నిస్సహాయంగా వీడు మాకు చేజిక్కిపోయాడు. మామూలు కోతులకంటె భిన్నంగా ఉన్నాడంటే అది వాడి ఖర్మ. అయితే వాడి మాటలు వింటే మాత్రం మాకు మండుకొచ్చింది. తనవి విద్రోహ భావాలని తన నోటితో తానే ఒప్పుకున్నాడు. అంచేత రోజుల తరబడి చెరలో ఉంచి వీడిచేత నేరం ఒప్పించే శ్రమ మాకు తప్పింది. వీడన్నమాటలివి:

"మీ గూఢచారులు నన్ను నిర్బంధించి ఇక్కడకు తీసుకురావడంవల్ల నా జీవితంలో మొదటిసారి ఉన్నతవర్గానికి చెందిన కోతుల సమక్షంలో మాటాడే అవకాశం నాకు లభించింది. ఇందుకు నా కృతజ్ఞత. దిగువ కొమ్మల్లో బతుకుతున్న కోతులు వందలకొద్ది సంవత్సరాలు ఏమాలోచించుకుంటున్నాయో మీకు తెలియక పోవచ్చు కాని నేను చెప్పదలచుకున్నాను. ప్రదేశాభిమానం పేరిట మీరు సాగిస్తున్న పళ్ళ దోపిళ్ళ కంటె ఘోరమైన పని మరోటిలేదని మా ఉద్దేశం. అయితే మన గోళ్ళూ కోరలూ వాడిగా ఉండమే ఈ హత్యలకి కారణం. మనలో మనం పోరాడుకోకుండా ఉంటే మన కోరలూ గోళ్ళూ ఇంత వాడిగా ఉండకపోయేవి. మర్కటజాతి పరిణామంలో (ఈమాట మేము అదిరిపడి విన్నాము) ఈనాడొక సందిగ్ధసమయం ఏతెంచినట్లు మేము విశ్వసిస్తున్నాము. ఏ తోకలైతే మనలో రక్తపిపాసను అభివృద్ధిచేస్తూ మనల్ని ఒక కొమ్మనుంచి ఇంకొక కొమ్మకి ఉయ్యాల లూగించాయో ఆ తోకల పొడుగు తగ్గిపోతున్న సంగతి మీరు కాస్త గమనించండి. ఇవి ఎవ్వరూ బుద్ధిపూర్వకంగా తగ్గించుకొంటున్నవి కావు. మన కోతులందరం కలిసి ఒక కొత్త విధానంలో జీవించగలిగితే ఏ అంతర్యుద్ధాలూ ఉండవు. పళ్ళ దోపిళ్ళకి అవసరం ఉండదు. ఎవరికి కావలసినన్ని పళ్లు వాళ్ళకుంటాయి. ఈ చెట్టుమీద ఎవరి జాగాలో వాళ్లు కూర్చొని ఎటువంటి అభ్యంతరమూ లేకుండా ఎవరిబతుకు వాళ్ళు ఎంతో ప్రశాంతంగా బతకవచ్చును. ఉన్నత కుటుంబాలకి చెందిన కోతుల్లారా! శ్రద్ధగా వినండి నేను చెబుతున్నది. మీకు కూడా ఈ యుద్ధాలేమీ ఉపకారం కలిగించేవికావు. మీరు ప్రకటించే యుద్ధాలలో మీకు చాకిరీచేసే వేలకొలది కోతులు చచ్చిపోతాయి. మీలోకూడా చాలామంది చచ్చిపోవడం, వికలాంగులు కావడం సంభవిస్తుంది. మీ బతుకులను గురించి అప్పుడప్పుడు మాకు

తెలిసే సంగతులనుబట్టి చూస్తే మీకోసం ప్రత్యేకంగా పెట్టుకున్న హక్కులేమీ మిమ్మల్ని సుఖపెడుతున్నట్లు తోచదు. ఆహార విహారాదుల్లో మీరు మాలాంటి వానరులే!"

ఇంత ఛండాలపు ఉపన్యాసం వింటూఉంటే తక్షణం ఆ కోతిని చిత్రవధ చెయ్యాలనిపించింది మాకు. కాని మా అందర్లోకీ ముసలికోతి మమ్మల్ని వారించి తన దీర్ఘ వయస్సుకి సహజమైన జ్ఞానంతోను, కపటత్వంతోను విప్లవ నాయకుణ్ణి ఇలా ప్రశ్నించింది. "ఔనయ్యా! నువ్వన్నది బాగానేవుంది కాని మన చెట్టుమీద పంట పండక గొప్పవాళ్ళూ బీదవాళ్ళూ ఒక్కలాగే అల్లాడితే అప్పుడో?" ఇంకో, రంగుకోతి ఇలా జవాబిచ్చిందా ప్రశ్నకు: "మన గోళ్లూ కోరలూ వాడిగా లేకపోతే ఇతరులమీద దురాక్రమణ చెయ్యాలనే ఊహ మనకు పుట్టదు. ఎక్కువ పళ్ళున్న ఇంకో చెట్టు కోతులదగ్గరకు వెళ్ళి కోరలతో జడిపించడానికి బదులు మాటలతో నచ్చజెప్పుతాము. మన మెత్తని చేతులతో వాటికి కితకితలు పెడితే మనతో పళ్ళని పంచుకోవడాని కవి సమ్మతిస్తాయి. కోతులకి కితకితలంటే చాలా సరదా అని నేను వేరే చెప్పనక్కర లేదు."

"ఓ, మొనగాడు బయల్దేరాడండీ! యుద్ధాలు లేకుండా మంత్రిస్తున్నాడు," అని మాలో కొన్ని కోతులు వెక్కిరించాయి. కాని వీడికి కింది వర్గాలలో విపరీతమైన పలుకుబడి ఉందనడానికి నిదర్శనంగా కిందనించి వీడిపేరుతో జయజయధ్వానాలు బయలుదేరాయి. "ఆయన చెప్పినట్టు చెయ్యకపోతే మీకు పళ్లుతెచ్చే కూలీలుండరు" అని కిందనుంచి కేక వినిపించింది. "ఔను. ఇంకో యుద్ధంవస్తే ఇక మీరు దొంగి లించడానికి కూడా జనం ఉండరు" అన్నాడు నాయకుడు.

"వీణ్ని చంపేద్దాం" అని మేము ముసలికోతి చెవిలో ఊదేం.

"అడుగున వీడికి పెద్ద బలగం ఉంది. మనం అల్పసంఖ్యాకులం. ఆయుధాలు కూడా మనకి సిద్ధంగాలేవు" అంది ముసలికోతి.

అది వాస్తవమే. అంచేత కూలీకోతుల నాయకుణ్ని కింది కొమ్మలకి వెళ్ళి పోనిచ్చాం.

వాడు పోయాక మేమంతా మీదకొమ్మలమీద ఒక సమావేశం చేశాం. మా ముసిలికోతి ఇలా అంది: "వీడి ఉపన్యాసం మీకు వింతగానూ, విప్లవాత్మకంగాను తోచిఉండవచ్చు. నిజమేగాని వీడు చెప్పినదానిలో విశేషం ఏదీలేదు. విచిత్రం ఏదీ లేదు. కొత్తగా మనకి చెప్పిందీలేదు. సృష్టి ప్రారంభమయింది లగాయితు ఎన్నో విప్లవాలు జరిగాయి. అయితే ఏమయినట్టు? ఏదీబ్బాలేదు. తిరుగుబాటుకి పూర్వం ఏలావుందో తిరుగుబాటు తర్వాతకూడా అలాగే వుంటుంది ప్రపంచం. అంచేత

తిరుగుబాటుదారుణ్ని చూపి జడుసుకోకండి! ఇలాంటి వాళ్ళని నేను చాలామంది నెరుగుదును. ఇదోరకం పిచ్చి. మనం దువ్వవలసిన విధంగా దువ్వితే ఎవడిపిచ్చిలో పడి వాడు నిరపాయంగా మరణిస్తాడు. అదొహటిన్నీ వీడు చెప్పినదాన్ని పూర్తిగా మనం కొట్టివెయ్యకూడదు. యుద్ధంవల్ల కలిగే జననష్టం ఎంతో ప్రమాదకరమని వీడన్న మాటతో నేనూ ఏకీభవిస్తున్నాను. మన కార్మికులంతా యుద్ధంలో చచ్చిపోతే మనకి పళ్ళు తెచ్చిపెట్టే వాళ్ళుండరు. అప్పుడు మనం తిండిలేక మాడనైనా మాడాలి. లేదా సుఖంగా బతుకుతున్న ఈమీది కొమ్మల్ని వదిలి ఆహారాన్ని వెదుక్కుంటూ అడుగు ప్రదేశాల్లో అఘోరించాలి. ఎందుకొచ్చిన ఆపద చెప్పండీ ఇది మనకి? అంచేత ఈ ఒక్క విషయంలో మనంకూడా వీడి ఉద్యమాన్ని బలపరచాలని నేను అభిప్రాయ పడుతున్నాను."

"ఘోరం ఘోరం! అనాచారాన్నీ ద్రోహాన్నీ బలపరచడమా? అన్యాయం! అన్యాయం!" అని మేమంతా అరిచాం.

"ఊరుకోండి. మీకేమీ తెలియదు. సైనికుల్లాగ మీరు మాట్లాడుతారు. రాజకీయవేత్తగా నేను చెబుతున్నాను వినండి. వయస్సులో, చదువులో, తెలివిలో మీకన్న నేను పెద్దని మరిచిపోకండి ప్రజల్లో ఉన్న ఉత్సాహాన్ని మన చెయ్యిదాటిపోనివ్వకూడదు. కిందటి పళ్ళదోపిడి తర్వాత మనకాళ్లు చల్లబడ్డాయి. ఇంకా ఏమైనా వేడి మిగిలితే అది కింది జనాభాలోనే వుంది."

"మరి మా తోకలో?" అన్నాం మేము.

"మీరూ మీ వెధవ తోకలూ, వెధవ మర్యాదలునూ! నేనుచెప్పినట్లు చెయ్యండి- వేలకొద్ది తోకలచేత విజయతాండవం చేయిస్తాను- నాదీ పూచీ-"

"పవిత్రమైన మా తోకల్ని కాపాడి, పరిణామంనుంచి మమ్మల్ని రక్షించగలిగితే నువ్వేం చెయ్యమంటే అది చెయ్యడానికి సిద్ధం" అన్నాం మేము.

"మరేంలేదు- ముందుగా పళ్ళదోపిడీని ఇకమీదనుంచీ నిషేధిస్తున్నట్లు ప్రకటిద్దాం."

"అసంభవం."

"ప్రకటించడం ఎప్పుడూ అసంభవంకాదు- దేన్నైనా ప్రకటించవచ్చు- మళ్ళీ చెబుతున్నా- దోపిడీని నిషేధిస్తూ ఒక ప్రకటన చేద్దాం- నిమ్నజాతి కోతులకి ఉద్రేకం జాస్తీ- వాటితో వాదించి ఒక దారికి తీసుకురావడం కష్టం- వాదోపవాదాలద్వారా యథార్థం బైటపడుతుంది అనే సూత్రం వాటికి వర్తించదు- పైగా అది ప్రమాదంతో కూడుకున్న పని- నిమ్నజాతి కోతులు ఆకలిగొట్టు వెధవలు- ఆకలివల్ల మెదడుకీ, గోళ్ళకీ, వాడి పుడుతుంది- వాదనతో వాటి మెదడుని ఆకర్షించలేం- కాబట్టి వాళ్ళ

ఉద్రేకాలని రెచ్చగొడదాం. ఉద్రేకాల విషయంలో వాటికి శిక్షణగాని, అనుభవంగాని లేవు. ఔనామరి! పళ్ళదోపిడిని అంత మొందించినట్లు ప్రకటించాక మన ఉద్దేశానికి చిహ్నప్రాయంగా ఇంకో చిన్నపనికూడా చెయ్యాలి. ఎంత చిన్నపనైనా చాలు. అది చాలా సులభం. కిందటిసారి యుద్ధం ప్రకటించిన రోజుకి బదులు యుద్ధం ముగిసిన రోజున వార్షికోత్సవం జరుపుదాం. వందలకొద్దీ తోకలు ఆ రోజున ఉత్సాహంతో గెంతకపోతే వంద దానిమ్మగింజలు నేను ఓడిపోయినట్టే" అంది ముసిలిది.

సరే అంటే సరేనని అందరం ఒప్పుకున్నాం కాని ఈ జిత్తు పనిచేస్తుందని ఏమీ మాకు నమ్మకం లేకపోయింది. అంతేకాక ఇంకో రంగుకోతిని వురితియ్యలేక పోయాంకదా అని మాకెంతో అంత ఇదిగావుంది. అయితే నిషేధప్రకటన జరిగిన తక్షణం కింది కోతులు చూపించిన వుత్సాహంతో మా ముసిలిదాని తెలివి తేటలకి మేం మురిసిపోయాం. పొట్టితోక కోతులు రోజంతా ఒళ్ళు మరిచి గెంతులువేశాయి. "శాంతి! శాంతి!" "పళ్ళదోపిడి ముర్దాబాద్" "తినేవాళ్ళకే పళ్లు!" అనే కేకలతో చెట్టంతా హోరెత్తిపోయింది. ఆ నిషా కొంచెం మాకూ తగిలింది. ఏమిటీ గొడవంతా అని గండభేరుండపక్షి చూడ్డానికి వస్తే దాన్ని రెక్కలు పట్టుకొని ఆడించి, నోటినిండా దానిమ్మగింజలు కుక్కివేశాం. "ముసిలిదాన్ని, నాతో మీకు సరసా లేమిట్రా" అని అవ్వ మమ్మల్ని మందలించింది. "అవ్వా! నువ్వింకా భూలోకంనుంచి అంతర్ధానం కాలే"దన్నాం మేము, పరిణామవాదులను హేళనచేస్తూ.

వార్షికోత్సవం జరిగింది. నియమితమైన రోజున సరిగా మట్టమధ్యాహ్నం కాగానే ఎక్కడి కోతులక్కడ గుప్‌చప్‌గా తోకలు ముడుచుకు కూచున్నాయి. వేలకొద్ది కోతులు నిశ్చలంగా అలా వుండిపోవడం నిజంగా కన్నులవైభవంగా వుంది. అన్నిటి కన్నా చిటారుకొమ్మమీద మా ముసిలికోతి కూర్చుంది. తర్వాత ఎవరి హోదాకి తగిన కొమ్మమీద వాళ్ళు కూర్చున్నారు. ఎవరూ కదలలేదు. ఎండలో కళ్లు మిటకరించడం తప్పితే ఇంకేవిధమైన చలనమూ లేదు.

ఇలా ఒక నిమిషం జరిగిందోలేదో ఇంతట్లో హఠాత్తుగా ఒక దుర్ఘటం సంభవించింది. ద్రోహ బుద్ధికి మితి అంటూ వుండదని అప్పుడు మాకు బోధపడింది. ఎవ్వరూ కదలకుండా వున్న ఆ అవకాశం తీసుకొని ఒక కోతి గభీగభీమని ఎగురుతూ మీదిమీదికి వెళ్ళి బారులుతీరిన పెద్ద కుటుంబాలముందు నిలుచుంది. ఆ కోతి ఎవరో కాదు. పొట్టితోక కోతుల నాయకుడే.

"ఇదంతా మోసం! శాంతిని ఆరాధిస్తున్నట్లు నటిస్తూ మీరంతా రహస్యంగా యుద్ధప్రయత్నాలు చేస్తున్నారు. అసలు మీరు చప్పుడు చెయ్యకుండానైనా వుండలేక పోతున్నారు. చూడండి! మీరు కోరలెలా కొరుకుతున్నారో! గోళ్ళెలా గిల్లుకుంటు న్నారో" అని ఆ నాయకుడు అరిచాడు.

అదీ నిజమే- పళ్లు కొరకడం, గోళ్లు గిల్లుకోవడం మా కలవాటు. మాకు తెలియకుండానే మేమీ పనులు చేస్తాం.

క్షణకాలం మాకు మతిపోయి నట్లనిపించింది. ఏమీ చెయ్యలేకపోయాం. ఎందుకో సందేహించాం. ఇంతట్లో: "చంపండివాణ్ని, బతికుండగానే పాతెయ్యండి" అని కింద కోతులగుంపులనుండి అరుపులు వినబడ్డాయి. మా సందేహం పటాపంచలై మాలో కొందరం వాడిమీదపడ్డాం. వాడితో పోరాటం సులభ మనుకున్నారేమో? అబ్బో వాడు పెద్దపులిలాగ ప్రచండంగా విజృంభించాడు. మేం ఎన్నడూ ఎరగని చాక చక్యంతో, చిత్రమైన కుస్తీ పేచీలతో మాలో పదిమందిని విసిరేశాడు, అయితే వాణ్ని కేవలం సంఖ్యాబలంతో అదమాయించ గలిగాం. వాడిలో ఏదో విపరీతశక్తి వున్నట్టుంది. అదే వాడి అనుచరులలో కూడా పంపకం అయిందని మా నమ్మకం. ఏమయితేనేం వాణ్ని కింద కొమ్మల్లోకి కూలదోశాం. మా ముసిలికోతి వాణ్ని చూడ డానికి కిందకి వెళ్ళింది. మేమూ వెళ్ళాం-వొచ్చేప్రాణం పోయేప్రాణంగా వుంది వాడికి. కష్టంమీద ఊపిరి తీస్తున్నాడు. వాణ్ని చూసేసరికి మాకు విపరీతమైన వణుకు పుట్టింది. బోర్లాపడి వున్నాడు. వీపుమీద వెంట్రుకలు లేవు. అంతేకాదు వాడికి తోకకూడా లేదు.

"వీడు మానవుడు" అని ఒక్క గుక్కని అరిచాం మేము. మాకు కడుపుల్లో చెయ్యిపెట్టి కలచినట్లయింది.

చంపడానికి అనుజ్ఞ నిమ్మన్నట్లుగా మా ముసిలికోతివేపు చూశాం. ముసిల్ది మమ్మల్ని చూసి చిరునవ్వు నవ్వింది.

"అందుకే వీడు మనదగ్గరికి వచ్చినప్పుడు సిగ్గుతో చేతులు వెనక్కి పెట్టుకున్నాడు. చంపకండి వీణ్ని! చిత్రవస్తు ప్రదర్శనశాలలో దాచేద్దాం వీణ్ని!" అంది మా ముసలికోతి.

తర్వాత మేమంతా మా మీదికొమ్మలకి వెళ్ళిపోయాం. మా ముసిల్ది టక్కరి తనంగా నవ్వుతూ అడుగుకొమ్మలమీద కోతులగుంపుని చూపించే అంది:

"ఇక మనకి ఇబ్బంది తప్పింది- కోతుల ముఠా తన నాయకుణ్ని తానే చంపుకుంది!"

(వి. యస్. ప్రిట్ షెట్ వ్రాసిన 'ది ఏప్ హు లాస్ట్ హిజ్ టైల్' అనే కథకి అనువాదం)

ముద్రణ: ఆనందవాణి దీపావళి సంచిక

Victor Sawdon Pritchett (1900—) ఇంగ్లీష్ నవలాకారుడు, కథకుడు, విమర్శకుడున్నూ. ఇతని నవలలకేమో ఇంగ్లాండులోనూ, కథలకూ విమర్శ వ్యాసాలకూ అమెరికాలోనూ ప్రకాస్తి కలిగిందంటారు.